
MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 120 | శనివారం 22 ఆగస్టు 2026 | పేజీలు : 4 | వెల : 3/-






# ప్రజలే రాజకీయ చెత్తను తొలగించాలి

- వచ్చే నెల మొదటి వారంలో అనకాపల్లికి గోదావరి నీరు
- డేటా సెంటర్లపై కొందరు తప్పుడు ప్రచారం
- ప్రారంభంకాకుండానే నీళ్లు ఇంకిపోతున్నాయని అపోహలు సృష్టి
- గ్రూప్--1లో అక్రమాలతో ఏపీపీఎస్సీపై నమ్మకాన్ని దెబ్బతీశారు
- అలమండ కోడూరు స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర సభలో సీఎం చంద్రబాబు

**(అంకుశం, మాడుగుల, ఆగస్టు 22):**
ప్రజలు రాజకీయ చెత్తను కూడా కడిగేయాలని సీఎం పిలుపునిచ్చారు. ఎన్నికల్లో డబ్బు ప్రభావం లేకుండా చేయాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉందన్నారు. ప్రజలు మంచి నాయకత్వాన్ని ప్రోత్సహించినప్పుడే రాజకీయ నాయకులు కూడా తప్పులు చేయకుండా ఉంటారని చెప్పారు. మంచి పనులు చేయాలంటే రాజకీయాల్లోనూ ప్రక్షాళన అవసరమని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం అలమండ కోడూరులో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. సెప్టెంబర్ మొదటి వారంలో గోదావరి నీళు అనకాపల్లికి తీసుకొస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. అనకాపల్లి ఇక బెల్లానికి మాత్రమే ప్రసిద్ధి చెందిన ప్రాంతం కాదని, ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ సిటీ, డేటా సెంటర్లు, ఫార్మా, అల్యూమినియం తదితర పరిశ్రమలకు కేంద్రంగా మారుతోందని చెప్పారు. అనకాపల్లిని అన్ని కంపెనీలకు కేంద్రంగా, నాలెడ్జ్ ఎకానమీకి చిరునామాగా - మిగతా2లో

## చిరు.. మీరెన్నో పుట్టిన రోజులు జరుపుకోవాలి

**-- జన్మదిన శుభాకాంక్షలు చెప్పిన సీఎం చంద్రబాబు**

**(అంకుశం, అమరావతి, ఆగస్టు 22):**
ప్రముఖ చలనచిత్ర నటుడు, కేంద్ర మాజీ మంత్రి, పద్మభూషణ్ మెగాస్టార్ చిరంజీవికి సీఎం చంద్రబాబు నాయుడు జన్మదిన శుభాకాంక్షలు. 1978లో తెలుగు చిత్రసీమలో అడుగు పెట్టి అంచెలంచెలుగా ఎదిగి ఎనలేని కీర్తి ప్రతిష్టలను, ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకుని మెగాస్టార్ గా నిలిచారు. రక్తనిధి, నేత్ర నిధి ఏర్పాటు చేసి మానవత్వాన్ని చాటుకుని సమాజం పట్ల తన బాధ్యతను నెరవేరుస్తున్నారు. ఆయన ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, సినీ ప్రేక్షకులను మరింతగా అలరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని వెల్లడించారు.



## రూ.7,000 కోట్లతో కొత్త ఎల్‌పీజీ పైప్‌లైన్లు

- తెలంగాణకు ప్రయోజనం
- రూ.7,000 కోట్లతో ఎల్‌పీజీ పైప్‌లైన్ విస్తరణకు కేంద్రం ఆమోదం
- తెలంగాణలోని చర్లపల్లి నుంచి నాగ్‌పూర్ వరకు కీలక మార్గం
- దేశవ్యాప్తంగా 1,800 కిలోమీటర్ల మేర కొత్త లైన్ల నిర్మాణం
- ప్రాజెక్టును చేపట్టనున్న గెయిల్ ఇండియా లిమిటెడ్
- తగ్గనున్న రవాణా ఖర్చులు, ప్రమాదాల ముప్పు



**హైదారాబాద్**
దేశంలో ఎల్‌పీజీ సరఫరా వ్యవస్థను మరింత పటిష్ఠం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సుమారు రూ. 7,000 కోట్ల వ్యయంతో ఎల్‌పీజీ పైప్‌లైన్ నెట్‌వర్క్‌ను భారీగా విస్తరించేందుకు పెట్రోలియం, సహజ వాయువు నియంత్రణ మండలి (పీఎన్‌జీఆర్‌బీ) ఆమోదం తెలిపింది. ఈ బృహత్తర ప్రాజెక్టు ద్వారా తెలంగాణ రాష్ట్రానికి గణనీయమైన లబ్ధి చేకూరనుంది. ప్రభుత్వ రంగ సంస్థ గెయిల్ (ఇండియా) లిమిటెడ్ ఆధ్వర్యంలో సుమారు 1,800 కిలోమీటర్ల మేర కొత్త పైప్‌లైన్లను నిర్మించనున్నారు. ఇందులో భాగంగా తెలంగాణలోని చర్లపల్లి నుంచి - మిగతా3లో

## ఏపీలో 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్ విడుదల

**(అంకుశం, అమరావతి, ఆగస్టు 22):**
కూటమి ప్రభుత్వం పాలకులు గతంలో చెప్పిన విధంగానే శనివారం 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్ 2026ను విడుదల చేసింది. మొత్తం నాలుగు దశల్లో ఉద్యోగాల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో నోటిఫికేషన్లు విడుదల చేయనున్నారు. గ్రూప్-- 1లో 149 పోస్టులు, గ్రూప్-- 2లో 673 ఉద్యోగాలు, విద్యాశాఖలో 2,995 పోస్టుల (టీచర్ పోస్టులు సహా)తో పాటు పోలీస్, ఫైర్, జైళ్లు, అటవీ, పశు సంవర్ధక, ఎక్సైజ్, ఇంజినీరింగ్, విద్యుత్ తదితర శాఖల్లో ఖాళీలను భర్తీ చేయనున్నట్లు ఆర్థికశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది. మొత్తం నాలుగు దశల్లో 10 వేలకు పైగా ఉద్యోగాల భర్తీకి జాబ్ క్యాలెండర్ విడుదల చేయగా.. తొలి దశలో 1,523 పోస్టులు (ఉన్నత విద్యాశాఖ ద్వారా మే 15నే నోటిఫికేషన్ జారీ చేసి భర్తీ ప్రక్రియ ప్రారంభించారు). రెండో దశలో 3,231 పోస్టులకు సెప్టెంబర్ 15న నోటిఫికేషన్ ఇస్తారు. దీనికింద గ్రూప్--1 ఉద్యోగాలతో పాటు, పోలీస్, అటవీ, పశుసంవర్ధక తదితర శాఖల్లో ఖాళీలను భర్తీ చేయనున్నారు. మూడో దశలో 2,311 పోస్టులకు అక్టోబరు 15న నోటిఫికేషన్ విడుదల చేస్తారు. ఇందులో భాగంగా గ్రూప్--2, ఎక్సైజ్, ఇంజినీరింగ్, విద్యుత్ శాఖల్లో భారీగా పోస్టులు భర్తీ చేస్తారు. నాలుగో దశలో 2,995 పోస్టులకు అక్టోబర్ 15న డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి రాష్ట్రవ్యాప్తంగా విద్యాశాఖలో టీచర్ పోస్టులతో పాటు మరికొన్ని ఉద్యోగాలను భర్తీ చేస్తారు.

## 31న వెలిగొండ ద్వారా నీళ్లు విడుదల

**3 దశాబ్దాల వెలిగొండ కల సాకారం**

**నిర్వాసితులకు రూ.250 కోట్ల పరిహారం అందించిన సీఎం చంద్రబాబు**

**(అంకుశం, అమరావతి, ఆగస్టు 22):**
మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజల 30 ఏళ్ల ఆకాంక్షలు నెరవేరేలా వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభం కానుంది. ఆగస్టు 31వ తేదీన వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ప్రారంభించి నీళ్లు విడుదల చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. క్యాంపు కార్యాలయంలో శనివారం వెలిగొండ నిర్వాసితులకు మూడో విడతలో రూ.250 కోట్ల పరిహారం చెక్కును సీఎం చంద్రబాబు అందించారు. దీంతో ఇప్పటి వరకూ 6,206 నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. మొదటి విడతలో 2,557 కుటుంబాలకు రూ.318 కోట్లు, రెండో విడతలో 1,622 కుటుంబాలకు రూ.200 కోట్లను - మిగతా2లో



# యువ పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు

అంతరిక్ష రంగంలో ప్రపంచ ప్రతిభకు, కంపెనీలకు, పెట్టుబడులకు భారత్ ఒక ఆకర్షణ కేంద్రంగా మారగలదని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. వివిధ రంగాలలో అంతరిక్ష సాంకేతికతల విస్తృత అనువర్తనాలను అన్వేషించాలని స్పేస్ స్టార్టప్‌లను కోరారు. అంతరిక్ష రంగంలో ప్రతిభకు, పెట్టుబడులకు దేశాన్ని ప్రపంచ కేంద్రంగా మార్చాలని అన్నారు. శుక్రవారం నాడు సేవా తీర్థ్ (పీఎం కార్యాలయం)లో 20 స్పేస్ స్టార్టప్‌ల సీఈఓలు, వ్యవస్థాపకులతో నరేంద్ర మోదీ సమావేశమయ్యారు. ఈ మేరకు భారత అంతరిక్ష రంగం గురించి మోదీ వ్యాఖ్యానించారు. యువ అంతరిక్ష పారిశ్రామికవేత్తలకు తమ ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. వ్యవసాయం, పశు సంపద నిర్వహణ, పాడి, పర్యావరణం, ప్రజల దైనందిన జీవితాలను ప్రభావితం చేసే ఇతర రంగాలలో అంతరిక్ష సాంకేతికతను ఎలా ఉపయోగించవచ్చో అన్వేషించాలని స్పేస్ స్టార్టప్‌ల సీఈఓలు, వ్యవస్థాపకులను కోరారు. స్పేస్ స్టార్టప్‌ల వంటి కొత్త, సవాల్‌తో కూడిన రంగంలోకి ప్రవేశించి రిస్కులు తీసుకున్నందుకు వారిని ప్రశంసించారు. సాంకేతిక పరిజ్ఞానాల వినియోగాన్ని విస్తరించడానికి అంతరిక్ష సంస్థలు, ఇతర రంగాల సంస్థల మధ్య మరింత సహకారం ఉండాలని పిలుపునిచ్చారు. "ప్రపంచం అంతరిక్షం గురించి ఆలోచించినప్పుడు భారత్ వైపు చూసే ఒక ఎకో సిస్టమ్‌ను సృష్టించాలి. ప్రపంచవ్యాప్త ప్రతిభను, కంపెనీలను, పెట్టుబడులను ఆకర్షించడానికి దేశ అంతరిక్ష రంగం ఒక అయస్కాంతంలా పనిచేయగలదు. అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యం కల్పించడం పట్ల ప్రభుత్వానికి దార్శనికత ఉంది. ఒక కొత్త రంగాన్ని ముందుండి నడిపించినందుకు స్పేస్ స్టార్టప్‌ల సీఈఓలు, ఫౌండర్స్‌కు అభినందనలు. అనేక దేశాలు అంతరిక్ష రంగంలో పెట్టుబడులు పెట్టలేకపోతున్నాయి. కొన్ని దేశాలు ఇన్వెస్ట్ చేయడానికి ఇష్టపడటం లేదు. ఇది ప్రపంచ అంతరిక్ష రంగంలో భారతదేశానికి తన స్థానాన్ని బలోపేతం చేసుకునేందుకు ఒక అవకాశాన్ని కల్పిస్తోంది. చిన్న వయసు నుంచే పిల్లలలో అంతరిక్షం పట్ల జిజ్ఞాస, ఆసక్తిని



పెంపొందించడానికి అంతరిక్ష సంస్థలు, అటల్ టింకరింగ్ ల్యాబ్స్ మధ్య మరింత సన్నిహిత సహకారం ఉండాలి. "

భారత అంతరిక్ష రంగ యువ కెరటాలను కలవడం అద్భుతంగా ఉందన్నారు మోదీ. "ఒక కొత్త, సవాల్‌తో కూడిన రంగంలోకి ప్రవేశించి అసాధారణ ధైర్యాన్ని ప్రదర్శించిన యువ పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు వీరు. వారు రిస్కులు తీసుకున్నారు, సంస్కరణల ప్రక్రియను విశ్వసించారు. తమ ప్రయత్నాలలో నిలకడగా ఉన్నారు. దీని కారణంగా గత కొన్నేళ్లుగా అంతరిక్ష రంగంలో భారత్ ఎంతో సాధించింది. స్టార్టప్‌లు తమ పనిపై విశ్లేషణాత్మక ప్రజెంటేషన్లు ఇచ్చాయి. భవిష్యత్ కోసం దేశ సామర్థ్యాలను నిర్మించే క్రమంలో భారత ప్రభుత్వం వారికి అండగా నిలుస్తుందని స్పేస్ స్టార్టప్‌లకు హామీ ఇచ్చాను. అంతరిక్ష రంగంలో భారత్ ప్రపంచానికి ఒక బలమైన, వినూత్నమైన, వాణిజ్యపరంగా లాభదాయకమైన నమూనాను అందించగలదు" అని స్పేస్ స్టార్టప్‌ల సీఈఓలు, వ్యవస్థాపకులతో దిగిన ఫొటోను మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

**సీఈఓలు, ఫౌండర్స్ ఏమన్నారంటే?**

భారత ప్రైవేట్ అంతరిక్ష పరిశ్రమ వేగంగా సాధిస్తున్న ప్రగతిని స్పేస్ స్టార్టప్‌ల సీఈఓలు, వ్యవస్థాపకులు మోదీ వద్ద ప్రముఖంగా ప్రస్తావించారు. దేశ అంతరిక్ష రంగం అభివృద్ధి చేసిన సాంకేతికతలను స్వీకరించడానికి, వినియోగించుకోవడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న కంపెనీలు ఆసక్తి కనబరుస్తున్నాయని వారు అభిప్రాయపడ్డారు. అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యానికి అవకాశం కల్పించడం ఈ పరిశ్రమకు కొత్త అవకాశాలను సృష్టించిందని పేర్కొన్నారు. ప్రైవేట్ అంతరిక్ష పరిశ్రమకు ప్రభుత్వం నుంచి లభించిన మద్దతుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

స్కైరూట్ ఏరోస్పేస్, అగ్నికుల్ కాస్మోస్, పిక్సెల్, ధ్రువ స్పేస్, గెలాక్స్‌ఐ, పియర్‌సైట్, బెల్లాట్రిక్స్ ఏరోస్పేస్, దిగంతర, సాట్‌స్యూర్, సుహోరా టెక్నాలజీస్, మనస్తు స్పేస్, ఆస్ట్రోబేస్, టేక్‌మీ2స్పేస్, వ్యోమిక్, కాస్మోసర్వ్ స్పేస్, ఆర్బిట్‌ఎయిడ్ ఏరోస్పేస్, స్పైసర్వ్, సెరెండిపిటీ స్పేస్, వాసర్ ల్యాబ్స్, మిస్ట్‌ఈఓ సంస్థల సీఈఓలు, వ్యవస్థాపకులు ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. వారితో దేశ అంతరిక్ష రంగం గురించి మోదీ సంభాషించారు.

# జంతర్ మంతర్ వద్ద ఉద్రిక్తత

దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మరోసారి తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ప్రస్తుత కుల ఆధారిత రిజర్వేషన్ల విధానానికి వ్యతిరేకంగా పెద్ద సంఖ్యలో ప్రజలు, యువకులు జంతర్ మంతర్ వద్దకు చేరుకొని నిరసనలు తెలిపారు. రిజర్వేషన్ వ్యవస్థను సమీక్షించాలని, రిజర్వేషన్లలో సంస్కరణలు తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఈ ఆందోళన కార్యక్రమానికి ఎలాంటి ముందస్తు అనుమతులు లేవని పోలీసులు స్పష్టం చేసినప్పటికీ, పెద్ద ఎత్తున నిరసనకారులు భారీగా తరలివచ్చారు. దీంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా, శాంతి భద్రతల్ని కాపాడేందుకు ఢిల్లీ పోలీసులు, కేంద్ర పారామిలిటరీ బలగాలు నిరసన ప్రాంతానికి చేరుకొని భద్రతను పర్యవేక్షించాయి. ఈ నిరసన కార్యక్రమానికి అనుమతి నిరాకరిస్తూ ఢిల్లీ పోలీసులు గురువారమే ప్రకటన విడుదల చేశారు. అయినప్పటికీ శుక్రవారం ఉదయం నుంచే చిన్న చిన్న గుంపులుగా ప్రజలు జంతర్ మంతర్ వద్దకు చేరుకోవడం ప్రారంభించారు. ఈ క్రమంలోనే పరిస్థితి చేయిదాటిపోకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్త చర్యగా పోలీసులు జంతర్ మంతర్ వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో విస్తృత ప్రచారం జరగడం వల్లే నిరసనకారులు పెద్ద ఎత్తున తరలి వచ్చినట్లు తెలుస్తోంది. దాదాపు 5.6 మిలియన్ల ఫాలోవర్లు ఉన్న ఒక సంస్థకు చెందిన అధికారిక పేజీ ఇన్‌స్టాగ్రామ్‌లో గురువారం రోజు ఒక పోస్టర్‌ను పంచుకుంది. ఆగస్ట్ 21న మధ్యాహ్నం 2 గంటలకు జంతర్ మంతర్ వద్ద జరిగే శాంతియుత నిరసనలో పాల్గొనాలని ప్రజలకు పిలుపునిచ్చింది. 'రిజర్వేషన్ హటావో ఆందోళన్' (=వంవతీజుఫఅశీఅ ఝుశీ చాఅఎశీశ్రీఖఅ) అనే ఇన్‌స్టాగ్రామ్ పేజీ ద్వారా ఈ నిరసనకు పిలుపునిచ్చినట్లు తెలిసింది. ఈ పోస్ట్ బాగా వైరల్ కావడంతో ఉదయం నుంచే జనం గుంపులు గుంపులుగా జంతర్ మంతర్ దగ్గరికి రావడం ప్రారంభించారు. ఇటీవల 'కాక్రోచ్ జనతా పార్టీ' నిరసన విధానాల్ని అనుసరిస్తూనే ఈ వేదిక కూడా వేగంగా ప్రసిద్ధి చెందింది. ఈ పేజీ ద్వారానే రిజర్వేషన్ వ్యవస్థకు వ్యతిరేకంగా నిరసనలకు పిలుపునివ్వడంతో, పోలీసులు అప్రమత్తమై జంతర్ మంతర్ వద్ద భద్రతను



పటిష్టం చేశారు.

**సోషల్ మీడియా ప్రచారంపై పోలీసుల తీవ్ర హెచ్చరికలు**

ఆగస్ట్ 21న జంతర్ మంతర్ వద్ద రిజర్వేషన్ల సంస్కరణలపై నిరసన తెలిపేందుకు అనుమతి లభించిందంటూ సోషల్ మీడియాలో సర్క్యులేట్ అవుతున్న వార్తలు, వీడియోలు అబద్ధమని, తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు. ఢిల్లీ జిల్లా పరిధిలో భారతీయ నాగరిక్ సురక్ష సంహితలోని (దీచీూ) సెక్షన్ 163 (గతంలో సెక్షన్ 144 జతీూజ) ప్రకారం నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నాయని పోలీసులు వెల్లడించారు. ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటం, నిరసన ర్యాలీలు, ఊరేగింపులు, ప్రదర్శనలు నిర్వహించడాన్ని పూర్తిగా నిషేధించారు. ఇదే సమయంలో ఫేక్ న్యూస్‌ను, తప్పుడు సమాచారాన్ని సోషల్ మీడియాలో షేర్ చేయడం, ప్రచారం చేయడం లేదా నమ్మడం చేయొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఫేక్ న్యూస్ సృష్టించే వారిపై లేదా దాన్ని వ్యాప్తి చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**నిరసనలకు కేంద్రంగా జంతర్ మంతర్!**

ఢిల్లీ జంతర్ మంతర్ ఇటీవల ఎక్కువగా వార్తల్లో నిలిచింది. నీట్– యూజీ పేపర్ లీకేజీ ఆరోపణలు, అవకతవకలకు బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో కాక్రోచ్ జనతా పార్టీ (జజీూ) ఇక్కడే నిరసనల్ని ప్రారంభించింది. విద్యార్థుల పోరాటానికి లద్దాఖ్‌కు చెందిన ఇంజినీర్, పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్ చుక్ జంతర్ మంతర్ వద్ద జూన్ 28న ఆమరణ నిరాహార దీక్ష కూడా చేపట్టారు. అక్కడి నుంచే జులై 20న చేపట్టిన పార్లమెంట్ మార్చ్ ఉద్రిక్తతలకు దారితీసింది. ప్రభుత్వం ఆ తర్వాత లిఖితపూర్వక హామీలివ్వడంతో జులై 23న వాంగ్‌చుక్ దీక్ష విరమించారు. తర్వాత జులై 25న ధర్మంద్ర ప్రధాన్ కూడా రాజీనామా చేశారు. ఆ తర్వాతే జంతర్ మంతర్ వద్ద చాలా రోజుల తర్వాత జనసందోహం తగ్గింది. మళ్లీ ఇప్పుడు అక్కడికి భారీగా ప్రజలు తరలిరావడంతో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి.

# సిద్ధాంతాల ఆధారంగానే పదవులు

**న్యూఢిల్లీ :** భారత రాజకీయాల్లో వారసత్వం, కుటుంబ నేపథ్యం అనేది నాయకత్వ అర్హతగా మారిన తరుణంలో, భారతీయ జనతా పార్టీ మాత్రం కింది స్థాయి కార్యకర్త నుంచి అగ్ర నాయకుడిగా ఎదిగే సిద్ధాంతానికే మొగ్గు చూపుతోంది. ఇటీవల ప్రకటించిన పార్టీ కొత్త జాతీయ కార్యవర్గంలో సైతం ఈ తరహా క్యాడర్–బేస్డ్ లీడర్‌షిప్‌కే అధిష్ఠానం పెద్దపీట వేసింది. కేవలం ఒక పొలిటికల్ ప్యాషన్ , క్రమశిక్షణ, భావజాలం పట్ల అంకితభావంతో పనిచేసే సాధారణ కార్యకర్తకు కూడా నంబర్–1 స్థానాన్ని అధిష్టించే అవకాశం కల్పించడమే తమ శ్రేణుల బలం అని బీజేపీ మరోసారి రుజువు చేసింది.ఈ గ్రాస్‌రూట్ మోడల్ కు స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీనే అతిపెద్ద ఉదాహరణ. గుజరాత్‌లో ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్‌గా, సాదాసీదా కార్యకర్తగా ప్రయాణం ప్రారంభించి రాష్ట్ర ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా ఎదిగిన విధానం బీజేపీ సిద్ధాంతానికి నిలువెత్తు సాక్ష్యం. తాజాగా పార్టీ అత్యున్నత అధ్యక్ష బాధ్యతలను చేపట్టిన నితిన్ నబీన్ ప్రయాణం కూడా ఇందుకు భిన్నమైనది కాదు. యువజన మోర్చా స్థాయి నుంచి సుదీర్ఘకాలం పాటు క్షేత్రస్థాయిలో చెమటోడ్చి, కష్టపడి పనిచేసిన నైపుణ్యాన్ని గుర్తించే పార్టీ జాతీయ నాయకత్వ పగ్గాలను ఆయనకు అప్పగించింది.కొత్త జాతీయ కార్యవర్గంలో ఉపాధ్యక్షుడిగా ఎంపికైన రామ్ మాధవ్ , ఆల్ సెల్స్ కో కన్వీనర్‌గా స్థానం పొందిన విష్ణువర్ధన్ రెడ్డి వంటి నేతల ప్రయాణం ఆర్‌ఎస్‌ఎస్, ఏబీవీపీల పునాదుల మీదే సాగింది. రామ్ మాధవ్ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ లో క్షేత్రస్థాయి స్వయంసేవక్‌గా పొలిటికల్ డిప్లొమసీని, సిద్ధాంత పటిష్టతను నేర్చుకుని బీజేపీ జాతీయ రాజకీయాల్లో అత్యంత కీలకంగా మారారు. అలాగే ఏపీకి చెందిన విష్ణువర్ధన్ రెడ్డి విద్యార్థి విభాగమైన ఏబీవీపీ ద్వారా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి, ఎన్నో పోరాటాలు చేసి ఈ స్థాయికి చేరుకున్నారు. ఇవి కేవలం ఉద్యోగ బాధ్యతలు కావు, సిద్ధాంతం పట్ల ఉండే 'ప్యాషన్'.అధికార మార్పిడి , పదవుల పంపకంలో వారసత్వ రాజకీయాల ను పూర్తిగా పక్కనపెట్టడం బీజేపీకి సంస్థాగతంగా కొన్ని ప్రధాన ప్రయోజనాలను తెచ్చిపెడుతోంది. ఏ మూలన ఉన్న సాధారణ శ్రేణి నేతలకైనా, నేను కూడా రేపు జాతీయ స్థాయి నేతను కాగలను అనే ఆశ, ఉత్సాహం నిరంతరం పని చేసేలా ప్రేరేపిస్తాయి. పక్షపాతం లేకుండా పనితీరు, ఫలితాలే ప్రాతిపదికగా ప్రమోషన్లు ఇవ్వడం వల్ల పార్టీ నడిపించే వ్యూహకర్తలకు క్షేత్రస్థాయి సమర్థత దక్కుతుంది. ప్రత్యర్థి పార్టీలలో నడుస్తున్న కుటుంబ పాలన ను నిలదీసే నైతిక బలం ఒక్క బీజేపీకే సాధ్యమవుతుంది. ఈ గ్రాస్‌రూట్ నాయకత్వ నమూనాలో కొన్ని అంతర్గత సవాళ్లు కూడా లేకపోలేదు. క్షేత్రస్థాయి నుంచి కష్టపడి వచ్చిన నేతలకు సిద్ధాంతపరమైన నిబద్ధత ఉన్నప్పటికీ, ఎన్నికల సమయంలో విభిన్న సామాజిక సమీకరణాలను, గ్లామరస్ పాపులిజమ్‌ను తట్టుకుని ఓట్లుగా మలచడం ఒక్కోసారి క్లిష్టంగా మారుతుంది. అంతేకాకుండా ఇతర పార్టీల నుంచి వచ్చే మాస్ లీడర్లకు, కింది స్థాయి నుంచి ఎదిగిన ఆరెస్సెస్ బ్యాక్ గ్రౌండ్ ఉన్న 'ఆర్గనైజేషనల్' నేతలకు మధ్య సమన్వయం కుదర్చడం జాతీయ నాయకత్వానికి పెద్ద సవాలుగా మారుతుంటుంది.

## ప్రజలే రాజకీయ చెత్తను తొలగించాలి

-మొదటిపేజీ తరువాయి

తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ సందర్భంగా స్వచ్ఛ అలమంద కోడూరుగా తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించిన గ్రీన్ అంబాసిడర్లను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అనకాపల్లి జిల్లా ఎన్డీఏకు కంచుకోటగా నిలిచిందని సీఎం చంద్రబాబు అన్నారు. గతంలో అనకాపల్లికి పెట్టుబడులు రాకపోవడంతో జిల్లా వెనుకబడిపోతుందని చాలామంది ఆందోళన చెందారని, ఇప్పుడు విశాఖకు మించి అనకాపల్లికి పెట్టుబడులు వచ్చే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. డేటా సెంటర్లపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం విమర్శించారు. డేటా సెంటర్ నిర్మాణం ఇంకా ప్రారంభం కాకముందే నీళ్లు ఇంకిపోతాయని ప్రచారం చేయడం సరికాదన్నారు. ఒక డేటా సెంటర్ ప్రారంభిస్తే ఐదు డేటా సెంటర్ల స్థాయికి ప్రాజెక్టులు వచ్చాయని, ఐదు గిగావాట్ల సామర్థ్యం ఇక్కడికి వస్తే లక్షలాది మంది ఏఐ ప్రొఫెషనల్స్ తయారయ్యే అవకాశం ఉంటుందని చెప్పారు. అన్ని డేటా సెంటర్లకు కలిపి 3.5 టీఎంసీల నీరు మాత్రమే అవసరమవుతుందని తెలిపారు. ఆర్థిక అసమానతలు తగ్గి ప్రతి ఒక్కరి ఆదాయం పెరగాలని సీఎం అన్నారు. పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడినప్పుడే అభివద్ధికి అసలైన బెంచ్‌మార్క్ అని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వంగలపూడి అనిత, నారాయణ, కొల్లు రవీంద్ర, ఎంపీలు సీఎం రమేష్, చింతకాయల విజయ్, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి సహా జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## 31న వెలిగొండ ద్వారా నీళ్లు విడుదల

-మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వం చెల్లించింది. శుక్రవారం మూడో విడతగా 2,027 కుటుంబాలకు రూ.250 కోట్లు పరిహారాన్ని సీఎం చేతుల మీదుగా అందించారు. 48 రోజుల్లోనే నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.768 కోట్లను చెల్లించింది. నిర్వాసితులకు మరో రూ.132 కోట్లు మాత్రమే చెల్లించాల్సి ఉంది. వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ ద్వారా మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 1.19 లక్షల ఎకరాల ఆయకట్టుకు, 4 లక్షల మందికి తాగునీరు అందనుంది. వెలిగొండ నిర్వాసితులతో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. 'ఆయా జిల్లాల ప్రజల 30 ఏళ్ల కలను సుసాధ్యం చేసి చూపించాం. సీఎంగా 1995లో ఆ ప్రాంతానికి వెళ్లినప్పుడు రైతులు సాగు, తాగునీరు ఇవ్వాలని కోరారు. 1996లో నేనే ప్రాజెక్టుకు రూపకల్పన చేసి శంకుస్థాపన చేసి... 2026లో ప్రారంభిస్తున్నాను. వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ పూర్తి చేసి ఇప్పుడు ప్రారంభించేలా రెండేళ్లలో రూ.2,250 కోట్లు ఖర్చు చేశాం. నాడు ఎన్టీఆర్ శంకుస్థాపన చేసిన వివిధ ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రారంభించటం నా అదష్టం. ఈ ఏడాది ఎల్ నినో కారణంగా 50 శాతం లోటు వర్షపాతం ఉంది. శ్రీశైలం, నాగార్జున సాగర్‌లకు నీళ్లు రాలేదు. చాలా పొదుపుగా నీటిని వినియోగించుకోవాల్సి ఉంది. ఇబ్బందులు ఉన్నా ఎట్టి పరిస్థితుల్లోనూ వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి నీరు ఇవ్వాలని సంకల్పించుకున్నాం. 2021లోనే దీనిని పూర్తి చేసి నీరివ్వాల్సి ఉన్నా గత పాలకులు చేసిన డ్రామాలతో అది సాధ్యం కాలేదు. పోలవరం పూర్తి చేసి కష్ణాడెల్టాకు, శ్రీశైలంలో నీరు పొదుపు చేసి ప్రకాశం, నెల్లూరు, కడప, రాయలసీమ ప్రాంతానికి నీరు ఇవ్వొచ్చు. గంగా--గోదావరి-- కావేరి అనుసంధానించాలని సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదించాను. ఐదు నదులను అనుసంధానిస్తే నాలుగు రాష్ట్రాల్లో సమస్యలు తీరిపోతాయి. దేశానికే నీటి సమస్య పరిష్కారమై నీటి భద్రత వస్తుంది. వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు మేలు జరిగేలా ప్రయత్నం చేస్తున్నాం. ఈ నెల 31 తేదీన వెలిగొండ ద్వారా నీళ్లు విడుదల చేస్తాం. మార్కాపురం జిల్లాలో జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతీ ఇంటికి కుళాయి నీరు ఇస్తాం. సెప్టెంబరులోనే హార్టికల్చర్ హబ్‌కు ఫౌండేషన్ వేస్తాం. రామాయపట్నం పోర్టు ద్వారా రైతులు ఉద్యాన ఉత్పత్తుల్ని ఎగుమతి చేసుకునే అవకాశం ఉంటుంది. గత పాలకులు ఆర్థిక వ్యవస్థకు తీవ్ర నష్టం చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సూపర్ సిక్స్ లాంటి పథకాలు అమలు చేస్తున్నాం. అభివద్ధితో పాటు ప్రాజెక్టులు కూడా పూర్తి చేయాల్సి ఉంది. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయి. మంచి చేసే ప్రభుత్వాన్ని గుర్తించాలని ప్రజల్ని కోరుతున్నాను.'అని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సమావేశంలో జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, ఎర్రగొండపాలెం ఇంచార్జి ఎరిక్షన్ బాబు, ఆర్ అండ్ ఆర్ కమిషనర్ ప్రశాంతి, వెలిగొండ నిర్వాసితులు పాల్గొన్నారు.

## దేశంలో పెరుగుతున్న స్వైన్ ఫ్లూ..

దేశంలో స్వైన్ ఫ్లూ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో, జాతీయ స్థాయి సన్నద్ధత, నివారణ చర్యలపై కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్తంగా నిరంతర నిఘా, వ్యాధి వ్యాప్తి నిరోధక చర్యలు పటిష్ఠంగా ఉండాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఢిల్లీతో పాటు ఇతర ప్రధాన ప్రాంతాల్లోని ఆసుపత్రులలో బెడ్ల లభ్యత, ఐసోలేషన్ వార్డుల ఏర్పాటుతో పాటు అవసరమైన మందులు, టీకాల లభ్యతపై మంత్రి సమగ్రంగా సమీక్షించారు. నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, హెల్త్ సెక్రటరీలతో కూడిన బృందానికి నిరంతరం కేసులను పర్యవేక్షించాలని సూచించారు. ముఖ్యంగా వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే ముందస్తుగా గుర్తించడం, బాధితులకు సకాలంలో చికిత్స అందించడం.. ప్రజల్లో పరిశుభ్రత, అవగాహన పెంపొందించడం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాలు, మారుమూల జిల్లాల్లో కూడా అవసరమైన ఫ్లూ నిరోధక మందుల కొరత లేకుండా చూడాలని అన్ని రాష్ట్రాల ఆరోగ్య శాఖలను కోరారు.

## పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ వద్ద రాహుల్ గాంధీ మెరుపు ధర్నా

ఢిల్లీలోని పార్లమెంట్ పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై పెల్లెట్ గన్స్ ప్రయోగించిన ఘటనపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత విద్యార్థి సాహిల్ లోచబ్‌తో కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ఆయన, విద్యార్థి ఇచ్చిన ఫిర్యాదుపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసే వరకు అక్కడి నుంచి కదిలేది లేదంటూ పోలీస్ స్టేషన్ వద్దే బైఠాయించారు. రాహుల్ గాంధీ నిరసనకు దిగడంతో అప్రమత్తమైన పోలీసులు పార్లమెంట్ పోలీస్ స్టేషన్ వెలుపల భారీగా బలగాలను మోహరించారు. పరిస్థితి అదుపు తప్పకుండా ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బందిని కూడా రంగంలోకి దించారు. గత నెల జులై 20న జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు శాంతియుతంగా నిరసన చేపట్టిన సమయంలో పోలీసులు పెల్లెట్ గన్స్‌తో కాల్పులు జరిపారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ ఘటనలో సాహిల్?కు పెల్లెట్లు తగలడంతో తీవ్ర గాయాలయ్యాయని, ఒక కంటి చూపు ప్రమాదంలో పడిందని రాహుల్ పేర్కొన్నారు. గాయపడిన సాహిల్‌కు ఢిల్లీలోని ఎయిమ్స్ ట్రామా సెంటర్‌లో శస్త్రచికిత్స జరిగినట్లు తెలిపారు. దాంతో సాహిల్ లోచబ్ ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదును తీసుకుని రాహుల్ గాంధీ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ఫిర్యాదుపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఢిల్లీ స్థానిక డీసీపీతో కూడా ఆయన చర్చలు జరిపారు. అయినప్పటికీ కేసు నమోదు కాకపోవడంతో పోలీస్ స్టేషన్ వద్దే నిరసనకు దిగారు.

"జులై 20న, జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న సాహిల్‌పై పోలీసులు పెల్లెట్ గన్‌తో దాడి చేశారు. పెల్లెట్ల వల్ల తీవ్రంగా గాయపడిన సాహిల్ ఒక కంటి చూపు ఇప్పుడు ప్రమాదంలో ఉంది. శాంతియుత నిరసనపై ఇటువంటి క్రూరత్వం చట్టవిరుద్ధం మాత్రమే కాదు. ఇది ఒక తీవ్రమైన నేరం. ఈ దురాగతానికి హోం మంత్రి అమిత్ షా విద్యార్థులకు ఎలాంటి వివరణ ఇవ్వలేదు. ప్రధానమంత్రి కూడా వారికి క్షమాపణ చెప్పలేదు." అలాగే ఇప్పుడు, సాహిల్ న్యాయం కోసం ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలనుకుంటే, దానికి కూడా అనుమతించడం లేదని రాహుల్? అన్నారు. ఈ విధంగా రాజ్యాంగాన్ని, రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. "అమిత్ షా, మీరు న్యాయానికి ఎందుకంత భయపడుతున్నారు ఈ భయం మీరు మీ నేరాన్ని అంగీకరిస్తున్నారని చూపిస్తోంది" అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. సాహిల్?కు, అతడి లాంటి ప్రతి విద్యార్థి బాధితుడికి న్యాయం జరిగేలా చూస్తానని ఆయన ఉద్ఘాటించారు. రాహుల్ గాంధీ పోలీస్ స్టేషన్ వద్ద బైఠాయించిన విషయం తెలియడంతో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు పలువురు సీనియర్ నాయకులు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని రాహుల్‌కు మద్దతు తెలిపారు

## నేతన్న సేవలోపథకం నిధులు రాలేదని ధర్మవరం చేనేతన్నల ధర్నా !



**అంకుశం న్యూస్ ధర్మవరం ఆగస్టు, 22** శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయం ముందు ఉన్న మార్కెట్ యార్డ్ వద్ద చేనేత కార్మికులు ధర్నా చేపట్టారు ఇటీవల ప్రభుత్వం నేతన్న సేవలో భాగంగా 25000 అర్హులైన చేనేత కార్మికుల అకౌంట్లో జమ చేసింది కానీ తమకు ఇంతవరకు ఆ పథకంలో భాగంగా డబ్బులు జమ కాలేదని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డెక్కి నిరసనకు దిగారు ఈవీఎంల తనిఖీకి వచ్చిన జిల్లా కలెక్టర్ కు చేనేత కార్మికులు తమకు జరిగిన అన్యాయంపై గోడు వెల్లబోసుకున్నారు. అర్హులైన కార్మికులకు పథకం డబ్బులు పడేవిధంగా చర్యలు తీసుకుని అక్రమాలకు పాల్పడ్డ అధికారులపై విచారణకు ఆదేశిస్తారని కలెక్టర్ కార్మికులకు హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. ధర్నా జరిగిన ప్రాంతం ఎన్డీఏ కార్యాలయం ముందు ఉండడంతో డి.ఎస్.పి జగన్నాథరాజు ఆధ్వర్యంలో పోలీసులు భారీగా మోహరించారు.

## కదిరిలో ఘనంగా జాబ్ మేళా ముఖ్య అతిథిగా గా హాజరైన కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్



**అంకుశం న్యూస్,కదిరి,ఆగస్టు:22:** కదిరి పట్టణంలోని వాల్మీకి స్కూల్ ప్రాంగణంలో వాల్మీకి విద్యా సంస్థల అధినేత పవన్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.జాబ్ మేళాకు పెద్దఎత్తున హాజరైన యువతతో ఎమ్మెల్యే మాట్లాడారు.ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్న ప్రతి ఒక్కరికీ ఇలాంటి జాబ్ మేళాలు మంచి వేదికగా నిలుస్తాయని అన్నారు.యువతలో ప్రతిభకు కొదవ లేదు.సరైన అవకాశం,సరైన మార్గదర్శకత్వం లభిస్తే మంచి స్థాయికి ఎదగగలరు.ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా కాకుండా,నైపుణ్యాలను పెంచుకుని భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలి” అని ఎమ్మెల్యే సూచించారు.ప్రస్తుతం అనేక రంగాల్లో ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని,యువత తమ విద్యార్హతలకు అనుగుణంగా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఎంపికైన అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు.అలాగే స్థానికంగా యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించే కార్యక్రమాలకు తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే తెలిపారు.యువత భవిష్యత్తుకు బలమైన పునాది వేసేలా ప్రతి ఒక్కరూ కష్టపడి ముందుకు సాగాలని ఆకాంక్షించారు.జాబ్ మేళా నిర్వహణకు కృషి చేసిన వాల్మీకి విద్యా సంస్థల అధినేత పవన్ కుమార్ రెడ్డి ని ఎమ్మెల్యే అభినందించారు.ఈ కార్యక్రమంలో యువత,విద్యా సంస్థల ప్రతినిధులు,నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## మెగాస్టార్ చిరంజీవి పేరున నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి సురేష్



**అంకుశం న్యూస్,గోరంట్ల,ఆగస్టు:22:** గోరంట్ల మండల మెగా యూత్ ఫోర్స్ మండల అధ్యక్షుడు పి.వెంకటేష్ ఆధ్వర్యంలో గంగిరెడ్డిపల్లి ఆంజనేయ స్వామి దేవాలయంలో పద్మ భూషణ్ మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు చిరంజీవి పేరున ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి సురేష్, గోరంట్ల మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నరేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవి ఒక కేంద్రమంత్రిగాను, ఒక్క గొప్ప నటుడు గాను కాకుండా ఒక గొప్ప మానవతా వాది అని ఆయన స్థాపించిన బ్లడ్ బ్యాంక్ వల్ల ఎంతోమంది ప్రాణాలను కాపాడిన ఒక గొప్ప వ్యక్తి గాను ఆయన చరిత్రలో నిలిచిపోతారని ఈయన ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు.

## నా అన్నయ్యే నా ఏకైక హీరో చిరంజీవి పుట్టినరోజున డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భావోద్వేగ లేఖ...



**అంకుశం న్యూస్, అమరావతి, ఆగస్ట్ : 22** మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, ఆయన సోదరుడు పవన్ కల్యాణ్ సామాజిక మాధ్యమాల వేదికగా అత్యంత భావోద్వేగపూరితమైన లేఖను పంచుకున్నారు. చిరంజీవి వెండితెరపై నటుడిగా ఎదగకముందే తన నిజ జీవితంలో హీరో అని పేర్కొంటూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అన్నయ్య పక్కన నడవడమే గర్వం నర్సాపూర్‌లో చిరంజీవి కాలేజీ చదువుల రోజులను ప్రస్తావిస్తూ.. సెలవులకు ఇంటికి వస్తే పండుగ వాతావరణం ఉండేదని, తిరిగి వెళ్లేటప్పుడు ఇంట్లో పెద్ద వెలితి కనిపించేదని పవన్ తెలిపారు. బుల్లెట్ బైక్‌పై పొడవాటి జుట్టు, ఎన్‌సీసీ క్యాడెట్ శరీర సౌష్ఠవంతో కనిపించే అన్నయ్యను తాను ఓ ఫ్యాన్‌బాయ్‌లా ఆరాధించేవాడినని, స్కూల్ రోజుల్లో ఆయన పక్కన నడవడమే తనకు ఎంతో గర్వంగా అనిపించేదని రాసుకొచ్చారు. కన్నీళ్లు తుడిచిన ప్రేమ చిరంజీవి తొలిసారి విదేశాలకు (సింగపూర్) వెళ్లినప్పుడు తన కోసం ఆటవస్తువులు, కామిక్స్, క్యాసెట్లు తీసుకువచ్చి ఇంట్లో ఆనందాన్ని నింపారని గుర్తుచేశారు. అన్నయ్యకు పెళ్లైన సమయంలో ఎక్కడ దూరమవుతారోనని గదిలో ఒంటరిగా కూర్చొని ఏడ్చినప్పుడు.. వదిన సురేఖతో కలిసి తనను ఓదార్చి ఎంతో ఆప్యాయత చూపించారని పవన్ పేర్కొన్నారు.అలుపెరగని శ్రమ.. ఆదర్శ ప్రయాణం చెన్నైలో కెరీర్ ప్రారంభంలో రోజుకు 18 గంటల పాటు చెమటోడ్చి చిరంజీవి పనిచేసేవారని, తీవ్ర అలసటతో ఇంటికి వచ్చినా చదువు విషయంలో తనను ఎప్పుడూ ఒక్క మాటా అనలేదని తెలిపారు. దక్షిణాది, హిందీ చిత్ర పరిశ్రమల మధ్య వారధిగా నిలిచి మెగాస్టార్‌గా, పద్మవిభూషణ్ గ్రహీతగా ఎదిగిన ఆయన ప్రయాణం స్ఫూర్తిదాయకమన్నారు. ఇటీవల వెన్నెముక శస్త్రచికిత్స జరిగినా వెంటనే కోలుకుని మళ్లీ కసరత్తులు చేస్తూ పనిచేస్తున్న ఆయన పట్టుదలను కొనియాడారు. కోట్లాది మంది అభిమానులకు ఆయన మెగాస్టార్ కావొచ్చని, కానీ తనకు మాత్రం ఎప్పటికీ 'ఏకైక హీరో' అని పవన్ స్పష్టం చేశారు. చిరంజీవి నిండు నూరేళ్లు సంపూర్ణ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ 'జైహింద్'తో లేఖను ముగించారు.

## శ్రీ చైతన్య స్కూల్ విద్యా సంస్థలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారని ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్ జేఏసీ జిల్లా అధ్యక్షులు అమర్ యాదవ్....



**అంకుశం న్యూస్, అనంతపురం, ఆగస్టు : 22** ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా స్కూల్ నడుపుతున్న శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు తరగతులను బహిష్కరించినట్లు ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్ జేఏసీ జిల్లా అధ్యక్షులు అమర్ యాదవ్ తెలిపారు. శనివారం నాడు ఉదయం 7:30 కే స్కూల్ వద్ద స్టూడెంట్స్ జేఏసీ ఆధ్వర్యంలో బైఠాయించారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా అధ్యక్షులు అమర్ యాదవ్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అనేక విద్యాసంస్థలు నడుపుతున్నారు. గత రెండు నెలలుగా రుద్రంపేట వద్ద ఉన్న శ్రీ చైతన్య స్కూల్ కి ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేవని అనేకసార్లు డిఈఓ, కలెక్టర్, వినతి పత్రాలు ఇచ్చిన లాభం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకపక్క బిల్డింగ్ కడుతుంటే మరోపక్క ఎలా తరగతుల నిర్వహిస్తారని స్కూల్ ప్రిన్సిపాల్ నరేష్, విశ్వనాథ్, గోపాల్ ను ప్రశ్నించారు. విద్యార్థినులను (గర్ల్స్) అయితే ఆర్డిఓ ఆఫీస్ వద్ద ఉన్న శ్రీ చైతన్యలో హాస్టల్ వసతి, రుద్రంపేట వద్దచదువుల చెబుతున్నారని విద్యార్థులు విద్యార్థి నేతలకు ఫిర్యాదు చేశారు. కొత్త బిల్డింగ్ లో తమకు మరుగుదొడ్లు లేవని, మధ్యాహ్నం భోజనానికి మరొక బ్రాంచ్ కి తరలిస్తున్నారని కన్నీటి ఆవేదన చెందారు. విద్యార్థినుల తల్లిదండ్రులు వచ్చి 1,80,000 ఫీజులు కడుతుంటే తమ పిల్లలకు కనీస వసతులు లేవని యాజమాన్యం ప్రశ్నిస్తే, మీరు మీ పిల్లలను మన స్కూల్లో చేర్పించండి ఇక్కడైతే ఫుల్ ఫీజు కట్టి టీషీలు తీసుకెళ్లాలని విద్యార్థి తల్లిదండ్రుల పైన దాడులకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యల పైన డీఈవో అయూబ్ హుస్సేన్ కి ఫిర్యాదు చేయగా తమ విద్యాశాఖ అధికారులు వస్తున్నారని స్కూలు పరిశీలించి సీజ్ చేస్తామని హామీ ఇవ్వడంతో నేతలు దాదాపు స్కూల్ వద్ద 3 గంటలసేపు విద్యార్థి నేతలు ధర్నా నిర్వహించగా నాలుగో పట్టణ పోలీసులు రంగ ప్రవేశం చేసి విద్యార్థినేతలను సిఐలు ఏపీ మస్తాన్, వెంకటేష్ నాయక్ లు నేతలను శాంతింపజేసి, మీ సమస్యలు ఏమైనా ఉంటే వచ్చి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని కోరగా విద్యార్థి నేతలు విద్యార్థుల జీవితాలతో చలగాడమాడుతున్న శ్రీ చైతన్య యాజమాన్యం పైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని 4వ పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ ధర్నాలో సతీష్, రాఘవేంద్ర,విజయ్ ప్రశాంత్, పోలార్డ్, బుల్లే నరేష్, గోవింద్, రేవంత్,తదితర నేతలు పాల్గొన్నారు.

## దోపిడీ విధానం మానుకోకపోతే చరిత్రలో కలిసిపోతారు..

**రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్సీపీ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి...**




**అంకుశం న్యూస్, అనంతపురం, ఆగస్టు : 22** అనంతపురం జిల్లాలో పరిస్థితులు అత్యంత అధ్వానంగా ఉన్నా నాలుగు రోజుల అసెంబ్లీ సమావేశాల్లో జిల్లాకు సంబంధించిన ఒక్క సమస్యను కూడా ప్రస్తావించకపోవడం బాధాకరమని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ వేదికగా సీఎం దృష్టికి జిల్లా సమస్యలను తీసుకెళ్లే గొప్ప అవకాశాన్ని 14 మంది ఎమ్మెల్యేలు సద్వినియోగం చేసుకోలేదని విమర్శించారు. శనివారం అనంతపురంలోని జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

**“అసెంబ్లీలో ప్రజల గొంతు వినిపించాలి.. భజన కాదు”**

జిల్లాలో పెడబబ్బులు పెట్టే నాయకులు అసెంబ్లీలో మాత్రం పనికొచ్చే మాటలు మాట్లాడలేదని ప్రకాష్ రెడ్డి మండిపడ్డారు. ఎంతసేపూ చంద్రబాబుకు భజన చేయడమే సరిపోతోందా? అని ప్రశ్నించారు. ప్రజలు తమ సమస్యలను చెప్పాలని గెలిపిస్తే.. ముఖ్యమంత్రి పొగడ్తలకే అసెంబ్లీ వేదికను ఉపయోగించుకోవడం దురదృష్టకరమన్నారు.

**“సూపర్‌సిక్స్ హామీలు ఏమయ్యాయి..”**

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్లు, మహిళలకు నెలకు రూ.1,500, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి, ఉద్యోగాల హామీలు ఏమయ్యాయని నిలదీశారు. ఇవన్నీ అటకెక్కించినా సూపర్‌సిక్స్ అద్భుతంగా అమలవుతోందంటూ చంద్రబాబుకు వంగి వంగి దండాలు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు.

**“రైతు భరోసా అరకొర.. సున్నా వడ్డీ ఏదీ..”**

రైతు భరోసా అరకొరగా ఇచ్చారని, మహిళలకు సున్నా వడ్డీ పథకం అమలు కావడం లేదన్నారు. గత ప్రభుత్వం డ్వాక్రా మహిళల రుణాలపై చేసిన వడ్డీ మాఫీ కూడా నిలిచిపోయిందని విమర్శించారు. ప్రజలు సిగ్గుపడేలా వ్యవహరించకుండా తమను గెలిపించిన ప్రజల కోసం పనిచేయాలని ఎమ్మెల్యేలకు హితవు పలికారు.

**“పయ్యావుల పొగడ్తలు అనంతపురానికి ఏం తెచ్చాయి?**

సీనియర్ నాయకుడు పయ్యావుల కేశవ్ చంద్రబాబును మరీ ఎక్కువగా పొగడ్తలతో ముంచెత్తుతున్నారని ప్రకాష్ రెడ్డి అన్నారు. “చాలామంది సీఎంలు వచ్చారు..పోయారు.. చంద్రబాబు మాత్రం అలాగే ఉన్నారు” అని చెప్పడం కాదు.. అనంతపురం జిల్లాకు చంద్రబాబు ఏం చేశారో చెప్పాలని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి డిమాండ్ చేశారు.

## రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్‌లో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర

**నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ కలిసి పాల్గొన్నాను.**



**అంకుశం న్యూస్, అనంతపురం, ఆగస్టు : 22** ఈరోజు స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా అనంతపురం పట్టణంలోని రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అర్బన్ ఎమ్మెల్యే శ్రీ దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ తో కలిసి పాల్గొన్నాను. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, తడి చెత్త--పొడి చెత్త వేరు చేయడం, పారిశుద్ధ్య అలవాట్లు, మొక్కల పెంపకం మరియు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాం. విద్యార్థులు తమ ఇళ్లలో కూడా తడి, పొడి చెత్తను వేరు చేసేలా కుటుంబ సభ్యులను ప్రోత్సహించాలని సూచించాను. పాఠశాల ప్రాంగణంలో ఎమ్మెల్యే శ్రీ దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ తో కలిసి మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతను విద్యార్థులకు అప్పగించాం. చిన్ననాటి నుంచే పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ వంటి మంచి అలవాట్లను అలవర్చుకుంటే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలుగుతాం. ప్రతి విద్యార్థి బాధ్యతగల పౌరుడిగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు మున్సిపల్ కమిషనర్ ఇంచార్జ్, వివిధ సంస్థల కార్పొరేషన్ డైరెక్టర్లు , స్థానిక నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు

## ఛత్రపతి శివాజీ మహారాజ్ పురస్కారం అందుకున్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి యస్ నారాయణరెడ్డి



**అంకుశం న్యూస్ గుంటూరు ఆగస్టు 22** గుంటూరు జిల్లా పొన్నూరు మండలం నందు ప్రగడ కోటయ్య కళ్యాణ మండపం లో మనఎ పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకులు తిరుమల శెట్టి ఉమాశంకర్ ఆధ్వర్యంలో పదవ వార్షికోత్సవం సందర్భంగా బ్లడ్ డొనేషన్ క్యాంపు నిర్వహించడం జరిగినది. ఈ క్యాంపు లో సమాజంలో స్వచ్ఛందంగా సేవ చేసేటువంటి వారికి అవార్డ్ అందించటం జరిగింది. ఇందులో భాగంగా మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకులు తిరుమల శెట్టి ఉమాశంకర్ సంస్థ సభ్యుల చేతుల మీదుగా ఛత్రపతి శివాజీ మహారాజ్ జాతీయ పురస్కారం అందుకున్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి యస్ నారాయణరెడ్డి సంఘ సేవకులు ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఫౌండేషన్ వారు, అనంతరం ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మికంగా ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప వ్యక్తి శివాజీ మహారాజ్ పేరు మీద అవార్డ్ అందుకోవడం చాలా చాలా ఆనందంగా ఉందన్నారు. పలు రకాల స్వచ్ఛంద సేవలు చేస్తున్నందున రెండు గౌరవ డాక్టరేట్స్ ఆగస్టు 15 మార్కాపురం కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సామాజిక కార్యకర్తగా ప్రశంసా పత్రం అందుకోవడం జరిగింది. మానవసేవయే మాధవ సేవగా భావిస్తూ మరింత సేవ చేసే భాగ్యాన్ని కల్పించి అవార్డ్ అందించిన తిరుమల శెట్టి ఉమాశంకర్ కు కృతజ్ఞతలు తెలిపిన బి యస్ నారాయణరెడ్డి

## టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ 10 లక్షలు విరాళం



**అంకుశం న్యూస్ హైదరాబాద్ ఆగస్టు 22** హైదరాబాద్ క్యాంప్ కార్యాలయంలో చైర్మన్ బిఆర్ నాయుడుని కలిసి విరాళం అందజేసిన హైదరాబాద్ కు చెందిన దాత బండి సత్యనారాయణదాత ను అభినందించిన చైర్మన్

## దండే వారి వివాహ వేడుకల్లో పాల్గొన్న దారపనేని



**కనిగిరి ఆగస్టు 22 అంకుశం న్యూస్** కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం తూర్పు కోడిగుడ్లపాడు గ్రామపంచాయతీ పరిధిలోని ఇరిగినేని నగర్ వాస్తవ్యులు దండే తిరుపతయ్య శ్రీమతి మహాలక్ష్మమ్మ దంపతుల ఏకైక పుత్రిక భాగ్యలక్ష్మి, నెల్లూరు జిల్లా కాశీ పాలెం గ్రామ వాస్తవ్యులు, నీలం వెంకటేశ్వర్లు శ్రీమతి పద్మ దంపతుల ప్రథమ పుత్రుడు వెంకట వంశీ ల వివాహ వేడుకలలో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పాల్గొని వధువు చిరంజీవి లక్ష్మీ సౌభాగ్యవతి భాగ్యలక్ష్మిని శనివారం అక్షింతలతో ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వివాహ వేడుకల్లో సింగల్ విండో మాజీ డైరెక్టర్ దేవరకొండ చెన్నకేశవులు, దేవరకొండ పోతయ్య, దండే వెంకటేశ్వర్లు (మాదర పాకం) దండే శ్రీనివాసులు, దండే వెంకటేశ్వర్లు, దండే చౌడయ్య, దండే వెంకటసుబ్బయ్య, దండే ఏడుకొండలు, దండే వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు భారీ సంఖ్యలో దండే వారి వివాహ వేడుకల్లో పాల్గొన్నారు.

## తిక్క నారప్ప గంగయ్య కుటుంబానికి చెందిన ఐదుగురు పిల్లలకు సంబంధించిన తల్లికి వందనం ప్రాబ్లం క్లియర్ చేసిన హెచ్ఆర్ఏజే స్టేట్ కన్వీనర్ గుత్తా భాస్కర ...



**అంకుశం న్యూస్, అనంతపురం, ఆగస్టు : 22** హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ జాతీయ అధ్యక్షులు నందం నరసింహారావు సూచనలతో హెచ్ఆర్ఏజే స్టేట్ కన్వీనర్ గుత్తా భాస్కర నాయుడు ఆధ్వర్యంలో తిక్క నారప్ప గంగయ్య కుటుంబానికి చెందిన ఐదుగురు పిల్లలకు సంబంధించిన తల్లికి వందనం అర్హత కలిగి ఉండి అనర్హత లిస్టులో రావడంతో వారి కుటుంబానికి సంబంధించిన ఐదుగురు పిల్లలకు 65 వేల రూపాయలు రాలేదు. అర్హత కలిగి ఉన్న తల్లికి వందనం డబ్బులు రాకపోవడంతో సచివాలయంలో సంప్రదించి అక్కడ అన్ని పత్రాలు సమర్పించి సచివాలయం లాగిన్ లో క్లియర్ చేయించుకుని తర్వాత ఎమ్మార్వో లాగిన్ క్లియర్ చేయించుకుని తర్వాత ఆర్డీవో లాగిన్ క్లియర్ చేయించుకుని ఈరోజు అనంతపురం జిల్లా కలెక్టరేట్ కు వెళ్లి జాయింట్ కలెక్టర్ దగ్గర కు వెళ్లి అక్కడ సీసీ ని సంప్రదించి అందుకు సంబంధించిన పత్రాలు ఇన్కమ్ టాక్స్ కట్టడం లేదని దానికి సంబంధించిన పత్రాలు అలాగే ఇన్కమ్ సర్టిఫికెట్ ఇంకా అదనపు పత్రాలన్నీ సమర్పించి సీసీ లాగిన్ లో కూడా క్లియర్ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా హెచ్ ఆర్ ఏ జే టౌన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్. స్పోక్స్ పర్సన్ మురళి కృష్ణ. ఉమెన్ ఫోర్ట్ వైస్ ప్రెసిడెంట్ ఏ సి రాధా. వైస్ ప్రెసిడెంట్ జె. శ్రీనివాస్ రావు. స్పోక్స్ పర్సన్ సురేంద్ర. స్పోక్స్ పర్సన్ ఇంతియాజ్. తదితరులు పాల్గొన్నారనీ హెచ్ఆర్ఏజే స్టేట్ కన్వీనర్ గుత్తా భాస్కర నాయుడు తెలిపాడు.

## ఒడిశా రాష్ట్రంలో ధాన్యం పండిస్తున్న ఆంధ్రా రైతుల సమస్యలు పరిష్కారానికి ఎమ్మెల్యే కృషి



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఆగస్టు:** ఒడిశా రాష్ట్రంలో ధాన్యం పండిస్తున్న అనపర్తి నియోజకవర్గానికి సంబంధించిన రైతులు తమ ఇబ్బందులను తెలుపుతూ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనపర్తి మండలం రామవరంలో ఒడిశా ప్రభుత్వం తాము పండించిన ధాన్యం కొనుగోలు చేయడం లేదని సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి ని రైతులు కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరికి ఫోన్ ద్వారా సమస్యను వివరించారు. సానుకూలంగా స్పందించిన ఎంపీ పురంధేశ్వరి అనపర్తి నియోజకవర్గానికి సంబంధించిన రైతుల సమస్యను ఒడిశా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపినట్లు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చెప్పారు.

## పాఠశాలల్లో పరిశుభ్రతకు కృషి చేయండి

**ధర్మవరం కొత్తపేట్గా బాలుర ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్**

**పాఠశాల ఆవరణలో 20 మొక్కలు నాటిన కలెక్టర్**



**అంకుశం న్యూస్ ధర్మవరంఆగస్టు,22:** స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర (రాుూాూ) కార్యక్రమంలో భాగంగా ధర్మవరం పట్టణంలోని కొత్తపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ శనివారం పాల్గొన్నారు ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి శ్యాం ప్రసాద్ కలెక్టర్ మాట్లాడుతూ... స్వచ్ఛత అనేది ప్రతి ఒక్కరి అలవాటుగా మారాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రమైన వాతావరణం కోసం విద్యార్థులు భాగస్వాములు కావడమే కాకుండా, తమ కుటుంబ సభ్యులను మరియు పెద్దలను కూడా ప్రేరేపించాలని సూచించారు. ఉపాధ్యాయులతో ముచ్చటించిన ఆయన, విద్యార్థులకు స్వచ్ఛతపై క్రమం తప్పకుండా అవగాహన మరియు మోటివేషన్ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో దాదాపు 20 మొక్కలను నాటారు.పాఠశాలలోని మరుగుదొడ్లను పరిశీలించిన కలెక్టర్, వాటి నిర్వహణ సరిగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రన్నింగ్ వాటర్ సదుపాయం ఉన్నప్పటికీ సరిగా నిర్వహించకపోవడంపై హెడ్ మాస్టర్ ను మందలించి, తక్షణమే మెరుగైన పరిశుభ్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.మధ్యాహ్న భోజన వంటగదిని పరిశీలించి ఆహార నాణ్యతను, శానిటేషన్‌ను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.విద్యార్థులతో కలిసి హ్యాండ్ వాష్ కార్యక్రమంలో పాల్గొని, చేతుల పరిశుభ్రత వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య, ధర్మవరం తహసీల్దార్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు, పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళా భక్తులుతో పోటెత్తిన అమ్మవార్ల ఆలయాలు



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఆగస్టు:** హిందూ సంప్రదాయంలో శ్రావణ మాసం అత్యంత పవిత్రమైనది. ఈ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం నాడు మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగ వరలక్ష్మీ వ్రతం. శ్రావణ శుక్రవారం (వరలక్ష్మి వ్రతం) సందర్భంగా జిల్లాలోని అమ్మవార్ల ఆలయాలకు మహిళా భక్తులు పోటెత్తారు. ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తి ప్రపత్తులతో ఆలయాలన్నీ కళకళలాడాయి.అదే విధంగా శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని అనపర్తి శాంతిపురం వీధిలో గల మహాలక్ష్మి దేవి ఆలయం,ఎంతో ప్రసిద్ధిగాంచిన అనపర్తి గ్రామదేవత,చల్లని తల్లి వీరుళ్ళమ్మ తల్లి ఆలయం,దుర్గమ్మ తల్లి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.కాగా రెండవ శ్రావణ శుక్రవారం, శ్రీ వీరళ్ళమ్మ ఓం శక్తి సత్సంగం 32వ వార్షికోత్సవం సందర్భంగా అనపర్తి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామ గుర్రెడ్డి లక్ష్మి లలితా రాణి దంపతులు, కుమారుడు డాక్టర్ తాడి విశేష్ రెడ్డి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు వేడుకల సందర్భంగా అత్యవసర రక్తదాతలకు చిరు సన్మానం



**అంకుశం న్యూస్,కదిరి,ఆగస్టు:22:** పద్మ విభూషణ్ మెగాస్టార్ చిరంజీవి పుట్టిన వేడుకల్లో భాగంగా ఆపద సమయంలో అత్యవరస పరిస్థితుల్లో రక్తదానం చేస్తున్న రక్తదాతలను మెగా యూత్ ఫోర్స్ కమిటీ సభ్యులు సన్మానించారు.రక్తం అందక ఎవరూ చనిపోకూడదు అంటూ చిరంజీవి అభిమానులను రక్తదాతలే నేటి నవజీవన స్ఫూర్తి ప్రధాతలుగా,సమాజ సేవకులుగా తీర్చిదిద్దారు.ప్రతి సంవత్సరం మెగా స్టార్ చిరంజీవి పుట్టిన రోజు వచ్చింది అంటే కోట్లాది మెగా అభిమానులకు అదొక పండగలాగా దేశ వ్యాప్తంగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి రక్తదానం చేస్తారు.చిరంజీవి అంటే ఒక సినిమా పరిశ్రమకు మాత్రమే రోల్ మోడల్ కాదు కోట్లాది మంది సేవా తత్పరులకు,అభిమానులకు రోల్ మోడల్.ఇటువంటి గొప్ప సందర్భంగా ఆపద సమయంలో అత్యవరస పరిస్థితుల్లో అరుదుగా లభించే నెగిటివ్ బ్లడ్ డోనర్స్ కావాలి అని అడిగిన వెంటనే సమయం,సందర్భం దూరం భారం అనుకోకుండా రక్తదానం చేస్తున్న రక్తదాతలను సత్కరించుకోవడం నిజంగా ఇదొక గొప్ప సందర్భం అని మెగా యూత్ ఫోర్స్ ఉమ్మడి అనంతపురం జిల్లా కో కన్వీనర్ లక్ష్మణ కుటాల,కదిరి నియోజ వర్గం కన్వీనర్ కార్తీక్ దాసరి తెలిపారు.ఒక రక్తదానం – మరొకరికి ప్రాణదానం " అంటూ అపద సమయంలో మేము చేస్తున్న సేవలను గుర్తించి మెగా అభిమానులుగా మెగా యూత్ ఫోర్స్ కమిటీ సభ్యులు మమ్మల్ని సత్కరించడం సంతోషంగా ఉందని,లక్షలాది మంది అభిమానించే చిరంజీవి కి హృదయ పూర్వక జన్మదిన శు భాకాంక్షలు తెలుపుతూ ఆయన కళామతల్లి,సమాజానికి మరింత సేవ చెయ్యాలని ఎమర్జెన్సీ బ్లడ్ డోనర్స్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో శ్రీనాథ్ రెడ్డి,కొత్త కోట హరీష్ , సాయినాథ్ రెడ్డి ,హిదాయత్ ఖాన్,కొమ్మెర హరినాథ్,పూల లక్ష్మీ పతి,మంగళ మడక మనోహర్,పొరకాల రాజేంద్ర ప్రసాద్,హరి బాబు,బాబ్జాన్,మిథున్ చక్రవర్తి,చక్రపాణి ,రఘు,సోము,శివ తదితరులు పాల్గొన్నారు.

# అనంతలో క్యూఆర్ కోడ్ ద్వారా ఇంటింటి చెత్త సేకరణకి శ్రీకారం..






**ప్రయోగాత్మకంగా క్యూఆర్ కోడ్ ద్వారా ఇంటింటి చెత్త సేకరణను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..**

**జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..**

**అంకుశం న్యూస్అనంతపురం, ఆగస్టు 22 :** అనంతపురం రూరల్ మండలంలోని కాటిగానికాల్వ గ్రామంలో క్యూఆర్ కోడ్ ద్వారా ఇంటింటి చెత్త సేకరణకు శ్రీకారం చుట్టారు. జిల్లాలో ప్రయోగాత్మకంగా క్యూఆర్ కోడ్ ద్వారా ఇంటింటి చెత్త సేకరణను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ లాంఛనంగా ప్రారంభించారు. ప్రతినెల మూడవ శనివారం నిర్వహించే స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం "ఆరోగ్యవంతమైన పాఠశాలలు – ఆరోగ్యవంతమైన ఆంధ్ర" థీమ్ తో ఈ కార్యక్రమం నిర్వహించగా.. ఇందులో ప్రతి ఇంట్లో క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేపట్టగా, జిల్లా కలెక్టర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా క్లాప్ మిత్రలు, మహిళలు, ప్రజలతో జిల్లా కలెక్టర్ మాట్లాడి చెత్త సేకరణలో ఇబ్బందులను, గ్రామంలో ఉన్న ఇళ్లకు చెత్త తీసుకోవడానికి ఎంత సేపు పడుతుంది, రోజువారి చెత్త సేకరణ, క్యూఆర్ కోడ్ ద్వారా చెత్త సేకరణలో మార్పులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాలలో వస్తువులన్నీ ఉన్నాయా ఆరా తీసి, అక్కడే ఏర్పాటు చేసిన రూఫ్ టాఫ్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ ను పరిశీలించారు. పాఠశాల ఆవరణంలో మొక్కలను నాటారు. తదనంతరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నుంచి అంగన్వాడీ కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించగా, అక్కడ మానవహారం ఏర్పాటు చేసి అందరి చేత స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఆ తర్వాత అక్కడే ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. – ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు నూతనంగా ఞ= కోడ్ స్కాన్ ఆధారిత చెత్త సేకరణ విధానాన్ని ప్రయోగాత్మకంగా (పైలట్ ప్రాజెక్ట్) ప్రారంభించడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో శుభ్రతను నిరంతరం కొనసాగించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టామన్నారు. గ్రామీణ ప్రజలు మరియు క్లాప్ మిత్రులు/సిబ్బంది ఇద్దరూ కలిసి భాగస్వామ్యంతో పనిచేసినప్పుడే గ్రామంలో సంపూర్ణ పారిశుధ్యం సాధ్యమవుతుందన్నారు. కర్ణాటకలోని బెంగళూరు సమీపంలోని ఒక చిన్న గ్రామంలో ప్రతి ఇంటికి ఞ= కోడ్ ఏర్పాటు చేసి, చెత్త సేకరణ పర్యవేక్షిస్తున్న విధానాన్ని తెలుసుకుని, అక్కడికి వెళ్లి పరిశీలించిన తర్వాత ఈ నమూనాను ఇక్కడ పైలట్ ప్రాజెక్ట్‌గా స్వీకరించడం జరిగిందన్నారు. ?"సిబ్బంది సరిగా రావడం లేదు" అని ప్రజలు, "ప్రజలు చెత్త ఇవ్వడం లేదు" అని సిబ్బంది చెప్పే పరస్పర ఫిర్యాదులకు చెక్ పెట్టడానికి ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందన్నారు. 6 రూపాయల అతి తక్కువ వ్యయంతో ప్రతి ఇంటికి ఞ= కోడ్ కేటాయించబడుతుందన్నారు. ?గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడంలో అధికారులతోపాటు ప్రతి ఒక్క పౌరుడి భాగస్వామ్యం ఎంతో అవసరం అన్నారు. గ్రామ ప్రజలందరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యతను స్వయంగా తీసుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరూ పరిశుభ్రతను తమ దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకున్నప్పుడే స్వచ్ఛమైన, ఆరోగ్యవంతమైన స్వర్ణాంధ్ర నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు. జిల్లాలోని ప్రతి మండలంలో ఒక పంచాయతీని ఎంపిక చేసి క్యూఆర్ కోడ్ ద్వారా ఇంటింటి చెత్త సేకరణ కోసం ప్రణాళికలను రూపొందించాలని డిపీఓని ఆదేశించారు.– ఈ సందర్భంగా రాష్ట్ర బ్యూటిఫికేషన్ డైరెక్టర్ లక్ష్మీదేవమ్మ మాట్లాడుతూ ఇంటింటికి క్యూఆర్ కోడ్ ఉపయోగించి చెత్తను సేకరించడం చాలా ఉపయోగంగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిశుభ్రత బాగా ఉంచుకోవాలన్నారు.. ప్రజల భాగస్వామ్యంతో ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమైన తర్వాత, జిల్లాలోని అన్ని గ్రామాలు మరియు చిన్న చిన్న గ్రామ పంచాయతీల్లోనూ ఈ ఞ= కోడ్ విధానాన్ని విస్తరించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలందరూ అధికారులకు సహకరించాలని కోరారు. అనంతరం ఎన్జీవో ఆధ్వర్యంలో బట్టసంచులను, డస్ట్ బిన్లను గ్రామస్తులకు జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు.లి ఈ కార్యక్రమంలో డిడిఓ శకుంతల, తహసిల్దార్ ఉదయ్ కుమార్, ఎంపీడీవో దివాకర్, సాస డిసి సౌజన్య, డిప్యూటీ ఎంపీడీవో వెంకట్ నాయుడు, ఎన్జీఓ అనిల్ కుమార్, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## హరిత కదిరి --స్వచ్ఛ కదిరి సాధనలో భాగంగా మొక్కలు నాటిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



**అంకుశం న్యూస్,కదిరి,ఆగస్టు:22:** కదిరి పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ కూడలి డివైడర్ల మధ్యలో గౌరవ కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ మొక్కలు నాటారు.ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "స్వర్ణాంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర, ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక్కో మొక్క భవిష్యత్ తరాలకు మనం అందించే అమూల్యమైన కానుక అని అన్నారు.పచ్చదనాన్ని పెంపొందించడం,పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి,వాటిని సంరక్షిస్తూ పరిశుభ్రమైన,పచ్చదనంతో కూడిన కదిరి నిర్మాణానికి తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు."హరిత కదిరి -- స్వచ్ఛ కదిరి -- స్వర్ణాంధ్ర సాధనలో మనందరం భాగస్వాములం"అని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు.

# ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నదే లక్ష్యం





**రాష్ట్ర విపత్తు స్పందన అగ్నిమాపక శాఖ ఇన్ చార్జీ డిజి, డైరెక్టర్ పి .వెంకటరమణ**

**అంకుశం న్యూస్అనంతపురం, ఆగస్టు 22:** అత్యవసర సమయాల్లో అగ్నిమాపక శాఖ ద్వారా ప్రజల ప్రాణ రక్షణ ప్రధమ కర్తవ్యంగా పనిచేయాలని, ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యమని రాష్ట్ర విపత్తు స్పందన అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ పి. వెంకటరమణ తెలిపారు. శనివారం ఉదయం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా అనంతపురం ప్రధాన కేంద్రంలోని జిల్లా అగ్నిమాపక శాఖ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అలాగే జిల్లావ్యాప్తంగా శాఖ ద్వారా అందిస్తున్న సేవలుగురించి అధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అనంతరం పాత్రికేయ బృందం తో ప్రెస్ మీట్ నిర్వహించి అగ్నిమాపక శాఖ పని తీరుపై పలు విషయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం అగ్నిమాపక శాఖను అన్ని విధాల బలోపేతం చేయడానికి అవసరమైన మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యంగా రాష్ట్రవ్యాప్తంగా ఒక్కొక్క అగ్నిమాపక కేంద్రం సుమారు రూ .2. 25 కోట్ల వ్యయంతో 17 కొత్త అగ్నిమాపక కేంద్రాల భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి ఇప్పటికే 6 దాకా భవన నిర్మాణాలు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. మరో 36 అగ్నిమాపక కేంద్రాల ఆధునీకరణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. తొలి దశలో సుమారు రూ .33 కోట్లతో 65 వాహనాలు రెండవ దశలో 58 వాహనాలను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. అలాగే భవిష్యత్తు ప్రణాళికలు చర్యల్లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో మొత్తం రూ. 252. 86 కోట్లతో అగ్నిమాపక శాఖను బలోపేతం చేయడం జరుగుతున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలో పలు ప్రాంతాలలో 25 అధునాతనఅగ్నిమాపక వాహనాలు ఏర్పాటు చేయడం జరిగిందని ముఖ్యంగా గ్రామీణ ,అటవీ ప్రాంతాల కోసం వీటి సేవలు వినియోగించడం జరుగుతున్నట్లు తెలిపారు.

ఇటీవల కాలంలో గౌరవ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అమరావతిలోని ఉండవల్లి సీడ్ యాక్సెస్ రోడ్ వద్ద సుమారు రూ. 40 కోట్ల వ్యయంతో కొనుగోలు చేసిన 58 నూతన ఆధునిక అగ్నిమాపక వాహనాలను ప్రారంభించడం జరిగిందని గుర్తు చేశారు.

గతం కంటే మిన్నగా అగ్నిమాపక శాఖ ప్రజలకు చేరువగా సేవలందిస్తున్నదని ప్రాణ ఆస్తి నష్టాలను కాపాడుతున్నట్లు పేర్కొన్నారు.

అలాగే ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి పునస్కారాలను అందిస్తూ ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం డెమో ద్వారా అవగాహన కల్పించి ఉత్తమ సేవలు అందించిన అధికారులకు ఉద్యోగులకు మెడల్స్ ను బహుకరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి ఇతర అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## టిడిపి నాయకులను పరామర్శించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్,ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



**అంకుశం న్యూస్,అనంతపురం,ఆగస్టు:22:** ఇటీవల ప్రమాదవశాత్తు,ఇతర కారణాల వల్ల చికిత్స అనంతరం తమ నివాసాల్లో విశ్రాంతి తీసుకుంటున్న అనంతపురం జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్,టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాలార్ భాషని,మాజీ ఆర్టీసీ గౌరవ అధ్యక్షుడు మున్నా నగర్ శంకరయ్య ని,టీడీపీ నాయకురాలు గౌసియా ని అనంతపురం శాసనసభ్యులు దగ్గుపాటి ప్రసాద్,ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పరామర్శించారు.వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని,త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.